క్లుప్తంగా

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

హసన్‌పర్తి: అబ్దుల్‌కలాం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందిన భీమారానికి చెందిన కన్నె నవీన్‌ను 55వ డివిజన్ సత్యసాయి కాలనీలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో సత్యసాయి కాలనీ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రామకృష్ణారెడ్డి (టీఆర్‌కేరెడ్డి), సభ్యులు నారాయణ రెడ్డి, సత్యం, విజయ్‌కుమార్, శ్రీనివాస్, వెంగల్‌రావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న హీరో శ్రీకాంత్



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని సినీహీరో శ్రీకాంత్ శనివారం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు బహూకరించి అర్చకులు మహాదాశీర్వచనం అందజేశారు.

యూనిఫాంల అందజేత



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం నాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం యూనిఫాంలు అందజేశారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తన సొంత ఖర్చుతో యూనిఫాంలు సమకూర్చారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఏడో తరగతి వరకు తాను ఇదే పాఠశాలలో చదివినట్లు గుర్తుచేశారు. పాఠశాల అభివృద్ధికి రూ.2లక్షలు ఇస్తానని ఆయన ప్రకటించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అప్పటి గురువు పి.సాంబమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వాసంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా సుమారు రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ఆ పనులను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పూల, శ్రీనివాస్‌రెడ్డి, మదన్‌గౌడ్, శ్రీరాములు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజు, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్: రైలు పట్టాలు దాటుతున్న ఒక వ్యక్తిని శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. గీసుకొండ మండలం శాయంపేట గ్రామానికి చెందిన తమ్మడబోయిన రాజేందర్ (37) శుక్రవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో చింతలపల్లి రైల్వేస్టేషన్ మధ్య శాయంపేట గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో రాజేందర్‌ను రైలు ఢీకొట్టింది. మృతదేహానికి శవపరీక్ష చేసి కుటుంబ సభ్యులకు శనివారం అప్పగించినట్లు కానిస్టేబుల్ వివరించారు.

మద్యం విక్రేతపై కేసు

మడికొండ: ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన మగ్గిడి మహేందర్ మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా, పోలీసులు దాడి చేసి రూ.5,340 విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

'కలాం' డిఫెన్స్ ఎక్స్‌పో



మడికొండ: మడికొండలోని రైజింగ్ ఇండియన్ టెక్నో స్కూల్‌లో కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో శనివారం స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్షం, ఉపగ్రహాలు, చంద్రయాన్ గురించి విద్యార్థులకు ఇస్రో, డీఆర్‌డీఎల్, డీఆర్‌డీఓ ప్రతినిధులు వివరించారు. వాటి తయారీ, పనితీరు ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జాతరలను వాడుకోవద్దు

హన్మకొండ: రాజకీయ కక్ష సాధింపు కోసం జాతరలను వాడుకోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని పేర్కొన్నారు. గతంలో మేడారం జాతరను అట్టర్ ప్లాప్ చేయగా ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని గుర్తుచేశారు. హైదరాబాద్ బోనాల ఉత్సవాలపై సైతం ఏకంగా మంత్రులు, మేయరు బహిరంగంగా నిరసన తెలిపారని తెలిపారు. కొమ్మాల జాతరను కాంగ్రెస్ నాయకులు వాడుకోవడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.

వాయిదా పేరుతో కాలయాపన

- మూడు నెలలు గడుస్తున్నా విచారణ ఎప్పుడో?
- ఉపాధి హామీ పథకంలో అవినీతిపై స్థానికుల ఫిర్యాదు
- విచారణపై అధికారుల నాన్చుడు ధోరణి



హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయం

హసన్‌పర్తి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వాయిదా పేరుతో కాలయాపన చేస్తున్నట్లు స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి జరిగినట్లు సాక్ష్యాలతో సహా స్థానికులు లిఖిత పూర్వకంగా మూడు నెలల క్రితం ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టి వాయిదా వేసి, మళ్లీ విచారణ కొనసాగించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లిఖితపూర్వకంగా ఫిర్యాదు

హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో అవినీతి చోటు చేసుకుందని గతేడాది నవంబర్‌లో కలెక్టర్, డీఆర్డీఓకు స్థానికులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో పాటు అవినీతికి జరిగినట్లు ఆధారాలు కూడా జతపరిచారు. అందుకు మండల అధికారులు విచారణ చేపట్టి వాయిదా వేశారు.

వారికే విచారణ బాధ్యతలు

గత డిసెంబర్ 10వ తేదీన ఈజీఎస్ ఏపీఎం విజయలక్ష్మి విచారణకు వచ్చారు. దీంతో స్థానికుల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. ఈక్రమంలో విచారణను ఆమె వాయిదా వేశారు.

మూడు నెలలు గడుస్తున్నా..

వాయిదా వేసి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మళ్లీ విచారణ చేయలేదు. దీంతో స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈజీఎస్‌లో జరిగిన అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని స్థానికుడు రామంచ మధుకర్ తెలిపారు. విచారణ వాయిదా వేసి ఇప్పటి వరకు తిరిగి ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. విచారణ జరపడానికి అధికారులు నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు.

> **విజిలెన్స్‌కు అప్పగించాం**
>
> అన్నాసాగరంలో ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందనే ఫిర్యాదు మేరకు విచారణను విజిలెన్స్‌కు అప్పగించాం. విజిలెన్స్ అధికారులు విచారణ చేసి నిజానిజాలు వెలికి తీసి నివేదిక అప్పగించనున్నారు.
>
> - కర్ణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం



కేడీసీలో మాట్లాడుతున్న అనితారెడ్డి



ఖిలా వరంగల్: మాట్లాడుతున్న పరశురాములు

విద్యారణ్యపురి: వినియోగదారులకు జరిగే మోసాల వాటి నుంచి రక్షణ పొందేందుకు వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి సూచించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కామర్స్ విభాగం కన్స్యూమర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వస్తువుల నాణ్యత, సరుకుల కల్తీపై ఫిర్యాదులు చేయవచ్చని వివరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, కన్స్యూమర్ క్లబ్ కన్వీనర్, సేవా సంస్థ ప్రతినిధులు విశాల, డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వినోద్‌రావు, డాక్టర్ చిన్న, డాక్టర్ యాకూబ్, స్వర్ణలత పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులకు భంగం కలిగితే వెంటనే కమిషన్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయలక్ష్మి, విజయ, శ్రీలత, భాగ్యలక్ష్మి, సుమిత్ర, అరుణ పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

- వ్యాపారులతో అధికారుల భేటీ



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు తగు నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ (ఎఫ్ఏసీ) సురేంద్ర మోహన్ అన్నారు. హైదరాబాద్‌లోని మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అదనపు డైరెక్టర్ రవికుమార్, జెడీఎం ఉప్పుల శ్రీనివాస్, డీఎంఓ సురేఖ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని ఇబ్బందులను గతంలో మార్కెటింగ్ అధికారుల దృష్టికి చాంబర్ ఆఫ్ కామర్స్ పలు లేఖల ద్వారా తీసుకుపోవడంతో స్పందించిన అధికారులు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి యార్డుల క్లీనింగ్, సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాలు, వైఫై సౌకర్యం కల్పించుటకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వారు హామీ ఇచ్చినట్లు వివరించారు. చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, చాంబర్ ప్రతినిధులు అల్లె సంపత్, కైలాస హరినాథ్, ఎన్‌రెడ్డి లింగారెడ్డి, నాగభూషణం, సదానందం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్వీ నాయకులపై ఫిర్యాదు



హసన్‌పర్తి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కుక్క బొమ్మ అతికించి కించపరిచిన ఓయూ బీఆర్ఎస్వీ నాయకులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ నిరుద్యోగుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ కోరారు. ఈమేరకు నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మధుకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసిన బీఆర్ఎస్వీ నాయకులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నరేష్, నాయకులు గుండేటి సుమన్, ముత్యాల సాయి, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, సాయివికాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు'



హన్మకొండ చౌరస్తా: ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టసభల్లో ఆమోదిస్తూ తీర్మానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. హనుమకొండ చౌరస్తాలోని రామకృష్ణ ఆస్పత్రిలో ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఈ సమ్మేళనంలో బొట్ల భిక్షపతి, పాలడుగు శ్రీనివాస్, రణధీర్, వినయ్, శ్వేత, సుధాకర్, మేరీ, అనిత, రాములు, వీరేశం, పరశురాములు, శ్రీనివాస్, లక్ష్మయ్య, కృష్ణ, మురళీకృష్ణ, విక్రమ్, ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మసీదుల ఎదుట శాంతియుత నిరసనలు



ప్లకార్డులు ఆవిష్కరిస్తున్న సంస్థ బాధ్యులు

న్యూశాయంపేట: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు సోమవారం జోహార్ నమాజ్ అనంతరం అన్ని మసీదుల ఎదుట ప్లకార్డులు పట్టుకుని శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు గ్రేటర్ వరంగల్ ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్ సుభాన్, అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి మెయిల్ పంపినా కేంద్రం ఖాతరు చేయడం లేదని విమర్శించారు. సమావేశంలో కమిటీ బాధ్యులు అజీజుల్లా బేగ్, బాబా ఖాదర్ వలీ, హబీబ్‌ఖాన్, ఎంఏ.బాబా, మహ్మద్ చాంద్‌పాషా, మహ్మద్ షకీల్ అహ్మద్, మహ్మద్ మొహినొద్దీన్, అఫ్జల్ మొహినొద్దీన్, ఆరీఫ్, దస్తగీర్ పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యం కల్పించిన కాన్షీరాం



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: బహుజనుల్లో రాజకీయ చైతన్యం కల్పించిన కాన్షీరాం ఆదర్శప్రాయుడని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఆలువాల సంజీవయ్య అన్నారు. బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాలలో శనివారం నిర్వహించిన కాన్షీరాం జయంతి సభలో ఆయన మాట్లాడారు. దేశంలో అధికశాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల హక్కుల కోసం, బహుజనుల రాజ్యాధికారం కోసం ఆయన కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కవిత, శ్రీదేవి, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, అధ్యాపకుడు డాక్టర్ రాజేందర్, బీఎస్ఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, వివేక్, ఉమేష్, మహ్మద్‌అలీం పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల దీక్షను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద ఈనెల 16న జరగనున్న మాదిగ ఉద్యోగుల దీక్షను విజయవంతం చేయాలని కాకతీయ యూనివర్సిటీ ఎంఈఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, అప్పటివరకు ఉద్యోగాల నియామకాలు చేపట్టవద్దనే డిమాండ్‌తో చేస్తున్న దీక్షలో మాదిగ ఉద్యోగులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. సమావేశంలో కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎంఈఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరు ప్రభాకర్, ఎంఈఎఫ్ కేయూ జనరల్ సెక్రటరీ డాక్టర్ సుజాత, బాధ్యులు డాక్టర్ సంగాల ఎఫ్రీమ్ రాజు, బొక్క మొగిలి, రణధీర్, మొగిలి మాదిగ విజయ్‌రావు, పున్నం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన మాసం మార్చి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నయీంనగర్: కొలన్ క్యాన్సర్ (పెద్దప్రేగు క్యాన్సర్)పై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం కూరపాటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మార్చి నెలను కొలోరెక్టల్ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కూరపాటి రమేష్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో పెద్దపేగు క్యాన్సర్ కూడా ఒక మహమ్మారిలా వ్యాప్తి చెందిందన్నారు. మలంలో రక్తం పడడాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి డాక్టర్ సలహాలు పొందడం వలన క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాధిక, మురికి రోహిణి, సుధాకర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులను అమలు చేయాలి



బహుమతి ప్రదానం చేస్తున్న మహాలక్ష్మి



వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

కాజీపేట రూరల్: రాజ్యాంగం కల్పించిన మహిళల హక్కులు సంపూర్ణంగా అమలు అయినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం జరుపుకున్నట్లు అని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ ఉమెన్స్ వింగ్ కోఆర్డినేటర్ డి.మహాలక్ష్మి అన్నారు. కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేతో పాటు అన్ని డిపార్ట్‌మెంట్లలో మహిళలకు కనీస వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సంఘ్ సీడబ్ల్యూసీ సభ్యుడు సాధినేని వెంకటనారాయణ, రిటైర్డ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ చింత మురళి, మహిళా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మహిళా దినోత్సవం

వరంగల్ చౌరస్తా: వరంగల్, హనుమకొండ జిల్లాల ఆర్యవైశ్య మహిళా విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వరంగల్ స్టేషన్ రోడ్డులోని రాధాకృష్ణ గార్డెన్‌లో నిర్వహించారు. వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చొల్లేటి కళావతి, కార్యదర్శి గార్లపాటి శ్రీలత, కోశాధికారి తాటిపల్లి రాజమణి, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు పడకంటి జ్యోతి, ప్రధాన కార్యదర్శి దొడ్డ దేవి, కోశాధికారి అయిత పద్మజ, మహిళలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఉప్పల శారద, కార్యదర్శి కాచం సుష్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వరాజ్యలక్ష్మి, వరంగల్, హనుమకొండ జిల్లాల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు శ్రీనివాస్, తోట సురేష్, నాయకులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలతో మానసిక ప్రశాంతత



వరలక్ష్మిని సన్మానిస్తున్న అధ్యాపకులు, తదితరులు

ఖిలా వరంగల్: ఉపవాస దీక్షతో ప్రార్థనలు చేస్తే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని కేయూ యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి, వ్యాఖ్యాత సయ్యద్ మగ్దూం మొహినొద్దీన్, తాళ్లపద్మావతి కళాశాల డైరెక్టర్ తాళ్ల వరుణ్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రీరంజాన్ వేడుకలను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఫసియొద్దీన్, ఎంవై.బేగ్, డాక్టర్ సురేందర్, మాధవి, జోత్స్న, రమ్యకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

జిమ్నాస్టిక్స్ న్యాయనిర్ణేతకు సన్మానం



వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు టర్కీలో జరగనున్న జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌కు న్యాయనిర్ణేతగా ఎంపికైన వరంగల్ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి భరద్వాజ్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సన్మానించారు. వరంగల్ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో హనుమకొండ ఇన్‌చార్జ్ డీవైఎస్ఓ శ్రీమన్నారాయణ, ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌రావు, కార్యదర్శి సాంబయ్య, ఉపాధ్యక్షులు మధుసూదన్, శ్రీనివాస్, సోమరాజు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

18న కేయూలో విద్యార్థుల రాష్ట్ర సదస్సు

కేయూ క్యాంపస్: ఈనెల 18న కాకతీయ యూనివర్సిటీ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి కావ్య తెలిపారు. ఈమేరకు సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఆవరణలో సదస్సు వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ ఉపాధ్యక్షురాలు అనూష, బాధ్యులు గణేష్, సహాయ కార్యదర్శులు యాదగిరి, సాధన, సౌమ్య, శ్రీజ, చారి, నాగరాజు, పెరియార్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో దేశభక్తి పెంపు

ఖిలా వరంగల్: ఎన్‌సీసీతో కేడెట్లలో ఐకమత్యం, స్నేహభావం, క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఏవీఎస్ లిటిల్ జెమ్స్ పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు అంకతి సాగర్ అన్నారు. వరంగల్ 17వ డివిజన్ స్తంభంపల్లిలోని స్కూల్‌లో పదో టీజీ ఎన్ఎస్ఎస్ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ రామదురై ఆధ్వర్యంలో హవల్దార్ ముగ్బుల్ బాషా, హవల్దార్ కుమార్ డీజీ నేతృత్వంలో 23 మంది విద్యార్థులను ఎన్‌సీసీ కేడెట్లుగా శనివారం ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్, చాంద్, రహీం పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

న్యూశాయంపేట: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని సూచించారు.

ఏఐకేఎంఎస్ సభలను విజయవంతం చేయాలి

వరంగల్: ఈనెల 22, 23వ తేదీల్లో మహారాష్ట్రలోని నాందేడ్ పగార్‌నగర్‌లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 3వ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు మహాసభల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి కృష్ణ, రాజన్న, రంజిత్, ఆదిత్య, పద్మక్క, మధు, సుమన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులను పూజించాలి

ఖిలా వరంగల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు తమ తల్లిదండ్రులు, గురువులను పూజించాలని విద్యావేత్త, రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ రామిరెడ్డి అన్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్‌లోని టాలెంట్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ ముక్కెర రవీందర్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల దీవెన వేడుకను శనివారం నిర్వహించారు. అనంతరం గురువులు, తల్లిదండ్రుల పాదాలకు విద్యార్థులు పాదాభివందనం చేశారు. ఉపాధ్యాయులు సిరివెన్నెల, అజిస్, బాబు, యాదగిరి, ఉదయ్‌భాస్కర్, శ్రీజ, దేవేందర్ పాల్గొన్నారు.

మాదిగలను నమ్మించి మోసం చేస్తున్న సీఎం

హన్మకొండ: తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ అమలుచేసి మాదిగలకు న్యాయం చేస్తామని, అవసరమైతే ప్రత్యేకమైన ఆర్డినెన్స్ తీసుకువచ్చి, ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ అమలు చేస్తామని చెప్పి మాదిగలను సీఎం రేవంత్ రెడ్డి నమ్మించి ఇప్పుడు మోసం చేస్తున్నారని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి కుమ్మరి రాజయ్య మాదిగ ఆరోపించారు. బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 7వ రోజుకు చేరుకున్నాయి.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

వరంగల్ అర్బన్: బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 6వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో నాయకులు గంగారం మల్లన్న మాదిగ, ఇసంపెల్లి రాజుమాదిగ, మాదాసి సుధాకర్ మాదిగ, కల్లెపెల్లి రమేష్ మాదిగ, కొమురయ్య మాదిగ పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన 'ఎర్రగట్టు గుట్ట'

- విశ్వక్సేన ఆధ్వర్యంలో అన్నదానం



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం ఆలయం భక్తులతో పోటెత్తింది. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులుదీరారు. దర్శనం కోసం రెండుగంటల సమయం పట్టింది. రాత్రి చిన్న రథాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించారు. నగర మేయర్ గుండు సుధారాణి, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జాతరలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ఈఓ వెంకట్రావ్ తెలిపారు.

భక్తులకు అన్నదానం

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విశ్వక్సేన ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ఈఓ వెంకట్రామ్, ధర్మకర్తలు రమేష్, సంతోష్, సురేష్, కనపర్తి రాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, విశ్వక్సేనా కమిటీ సభ్యులు పృథ్వీరాజ్, సట్యూరి సంతోష్, కృష్ణమూర్తి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.